సాక్షి
నంద్యాల
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025




మద్దిలేటయ్య కిటకిట

బేతంచెర్ల: శ్రీలక్ష్మి మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో ఆలయానికి రూ. 4.06 లక్షల ఆదాయం సమకూరింది.



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తు న్న అన్నప్రసాద వితరణకు శనివారం రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్లికార్జునరెడ్డి రూ.1,00,541 విరాళాన్ని ఏఈవో స్వాములకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,612.28
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 42,350
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 7,951

న్యూస్‌రీల్

నంద్యాల పొగాకు-2 రకం సాగుతో మంచి దిగుబడులు

నంద్యాల(అర్బన్): నంద్యాల పొగాకు-2 రకం పొగాకు సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమండ్రి ఐసీఏఆర్ కేంద్రీయ పొగాకు పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ తెలిపారు. అఖిల భారత సమన్వయ పథకం పరిశోధనల్లో భాగంగా స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో సాగవుతున్న నంద్యాల పొగాకు-1, 2 రకాలను శనివారం ఏడీఆర్ జాన్సన్, పొగాకు శాస్త్రవేత్తలు పుల్లిబాయి, సతీష్‌బాబుతో కలిసి డైరెక్టర్ శేషుమాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల పొగాకు-1, 2 బీడీ రకాలు ఇదివరకే ఆర్ఏఆర్ఎస్ నుంచి విడుదలయ్యాయన్నారు. పొగాకు-2 రకం దిగుబడి మామూలు రకాలతో పోల్చి చూస్తే అధిక దిగుబడి నమోదవుతుంది కాబట్టి రైతులు నంద్యాల-2 రకాన్ని సాగు చేయాలన్నారు.

20 నుంచి 'నైపుణ్య' శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబ్ డెవలపర్, డొమిస్టిక్ డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్స్‌కు ఇంటర్, ఆపై చదివిన వారు, వెబ్ డెవలపర్ కోర్సుకు డిగ్రీ లేదా బీటెక్‌లో కంప్యూటర్ చదివిన వారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో కూడా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అర్హులైన యువతీ యువకులు రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 8297812530 నంబరును సంప్రదించాలన్నారు.

జిల్లాలో 107 క్లస్టర్ పాఠశాలలు



మొక్క నాటుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 29 మండలాల్లో 107 క్లస్టర్ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, సర్వశిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ కో ఆర్డినేటర్ ప్రేమాంత కుమార్, జిల్లా సెక్టోరియల్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్లస్టర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించామన్నారు. ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాల మెరుగుదల, చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శివరాంప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, హైమావతి, పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన



దూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న పశువైద్య శాఖ అధికారి రాజశేఖర్

డోన్: సీసంగుంతల గ్రామంలో మేలు జాతి గేదె, ఆవు దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉమ్మడి కర్నూలు జిల్లా పశువైద్యశాఖ కార్యనిర్వాహక ముఖ్య అధికారి డాక్టర్ రాజశేఖర్ పరిశీలించారు. ప్రాంతీయ పశువైద్యశాల వైద్యులు డాక్టర్ నాగరాజు, శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. మేలుజాతి పాడి పశువులకు కృత్రిమ గర్భధారణతో పశుపోషకులు లబ్ధి పొందవచ్చన్నారు. ఈతకు ఈతకు మధ్య దూరం తగ్గించాలన్నారు. పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పశువైద్యులు ఉసేన్‌బాషా, డాక్టర్ హరీష్, డాక్టర్ భాను, డాక్టర్ సాయికీర్తి పాల్గొన్నారు.

బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి

కర్నూలు: బాల నేరస్తుల్లో ఉండే నేర స్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సెలింగ్, విద్యాబోధన ద్వారా మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి కబర్ది అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కబర్ది, కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో బాలుల న్యాయ చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు డీసీపీఓ శారద, నంద్యాల డీసీపీఓ స్వప్న ప్రియదర్శిని, జేజేబీ మెంబర్లు మాధవి, సునిత పాల్గొన్నారు.

'కూటమి' కునుకు.. పౌల్ట్రీపై పిడుగు!



కర్నూలు మండలం తులశాపురంలోని ఓ ఫారంలోని కోళ్లు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం నామమాత్రమే
- కేవలం బాతుల్లోనే వెలుగు చూసిన వ్యాధి
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలు నామమాత్రమే
- అస్తవ్యస్తమైన పౌల్ట్రీ పరిశ్రమ
- 60 శాతం వరకు పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- రోజురోజుకు పతనమవుతున్న ధరలు

పౌల్ట్రీపై 'బర్డ్‌ఫ్లూ' పిడుగు పడుతున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. కర్నూలులో కేవలం బాతుల్లోనే వ్యాధి ప్రభావం వెలుగు చూసింది. అయినా కోళ్ల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. తగిన జాగ్రత్తలతో చికెన్, గుడ్లు నిర్భయంగా తినే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పౌల్ట్రీ రైతులు నిండా మునిగిపోయారు. గడిచిన ఐదేళ్లుగా లాభాలు రాగా.. మొదటిసారిగా చికెన్ అమ్మకాలు పడిపోయాయి. ఫారాల నుంచి కోళ్లు బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో నష్టాలు పెరిగిపోతున్నాయి.



పౌల్ట్రీ రైతుల సంఖ్య

కర్నూలు జిల్లా **80**

నంద్యాల జిల్లా **95**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్లు **18** లక్షలు

ఒక్కో రైతుకు వచ్చిన నష్టం : రూ.లక్ష నుంచి రూ. **10** లక్షల వరకు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజల్లో బర్డ్‌ఫ్లూ భయం ఉండటం, రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం పౌల్ట్రీ రైతులకు శాపంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జనవరి రెండో పక్షంలోనే పెద్ద ఎత్తున కోళ్ల మృతి చెందాయి. మన రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఫిబ్రవరి మొదటి వారంలోనే పెద్ద ఎత్తున కోళ్ల మృతి చెందాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా చలి ప్రభావం అని కొట్టిపారేసింది. ఎందుకు ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున కోళ్లు మృతిచెందాయనే కోణంలో పరిశోధన చేయించలేదు. పౌల్ట్రీ రైతులను అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. కర్నూలులో కూడా ఈ నెల 3, 4 తేదీల్లోనే బాతులు మృతి చెందాయి. వీటిని తేలికగా తీసుకోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

తగ్గిన కొనుగోళ్లు

చికెన్ సెంటర్లు ఆదివారం కిటకిటలాడుతుంటాయి. పొట్టేలు మాంసం ధరలు కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి ప్రాంతాల్లో కిలో రూ.800 నుంచి రూ.1000 వరకు నడుస్తోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ ధరతో మాంసం తినలేని పరిస్థితి ఉంది. వీరికి కోడిమాంసం ఎంతో ఇష్టమైనది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఆదివారం చికెన్ ముక్క తినడానికి ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. కోళ్లలో బర్డ్‌ఫ్లూ పాజిటివ్ కేసు రాకపోవడంతో పౌల్ట్రీ రైతులు ఊపిరిపీల్చుకున్నా.. చికెన్, గుడ్ల కొనుగోళ్లు గణనీయంగా తగ్గిపోయాయి. మూడు రోజులుగా వినియోగం కనిష్ట స్థాయికి పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వమే ఆదుకోవాలి

నిండా మునిగిపోయిన పౌల్ట్రీ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంది. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే ప్రతి పౌల్ట్రీ రైతు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు నష్టపోయారు. సరిగ్గా వారం రోజుల క్రితం చికెన్ లైవ్‌కిలో ధర రూ.127 వరకు ఉంది. బర్డ్‌ఫ్లూ తర్వాత లైవ్ కిలో ధర రూ.87కు పడిపోయింది. ప్రభుత్వం ముందస్తుగా స్పందించి అప్రమత్తం చేసి ఉంటే కొంత వరకు నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉండేదనే చర్చ అందరిలో జరుగుతోంది. పౌల్ట్రీ రైతులకు తక్షణం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

కోళ్లు, గుడ్ల సరఫరా నిలిపివేత



నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద గుడ్ల వాహనాన్ని తనిఖీ చేస్తున్న తెలంగాణ అధికారులు

నందవరం: బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కోళ్లు, గుడ్ల సరఫరాను నిలిపివేసినట్లు వెటర్నరీ డాక్టర్ వరలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నాగలదిన్నె గ్రామంలోని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎమ్మిగనూరు నుంచి ఎలాంటి అనుమతులు లేని 30 వేల గుడ్లతో వచ్చి బొలెరో వాహనాన్ని తనిఖీ చేసి వెనక్కి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతానికి సరఫరా చేయాలంటే తప్పనిసరిగా ఉన్నతాధికారుల అనుమతి పత్రాలు చూపించాలన్నారు. ఎలాంటి అనుమతులు లేని గుడ్లు, కోళ్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ వెల్లడించారు. తనిఖీలో వెటర్నరీ అసిస్టెంట్ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధర పడిపోతోంది



మా గ్రామంలో 40 మంది రైతులు పౌల్ట్రీపై ఆధారపడి ఉన్నారు. మేం ప్రతి బ్యాచ్‌లో 5 వేల కోళ్లు పెంచుతాం. ఇవి 40 రోజుల్లో అమ్మకం కావాలి. బర్డ్‌ఫ్లూ కారణంగా కోడి లైవ్ కిలో ధర రూ.87కు పడిపోయింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా నష్టాలు వస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్లలో ఎలాంటి బర్డ్‌ఫ్లూ లేదు. ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలి. చికెన్, గుడ్ల వినియోగం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి.

– మధు, తులశాపురం, కర్నూలు మండలం

పరిహారం ఇవ్వాలి



బర్డ్‌ఫ్లూతో కోలుకోలేని విధంగా నష్టపోయాం. మా దగ్గర 10 వేల కోళ్లు ఉన్నాయి. కిలో లైవ్‌పై దాదాపు రూ.50 వరకు నష్టం వస్తోంది. ఈ ప్రకారం మాకు 8 లక్షల రూపాయల నష్టం వస్తోంది. కంపెనీలు చికెన్ ధరను గంట గంటకు తగ్గిస్తున్నాయి. బర్డ్‌ఫ్లూతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ఇవ్వాలి. చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని ప్రచారం చేయాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, జి.సింగవరం, కర్నూలు మండలం

కోలుకోలేని దెబ్బ



బర్డ్‌ఫ్లూ ప్రభావంతో పౌల్ట్రీ పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగిలింది. నంద్యాల జిల్లాలో ఈ ప్రభావం ఏమాత్రం లేకపోయినా కంపెనీలు ధర తగ్గించాయి. పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వచ్చింది. మేం కొన్నేళ్లుగా పౌల్ట్రీ రంగంలో రాణిస్తున్నాం. ప్రస్తుతం ఐదు వేలకు పైగా కోళ్లు ఉన్నాయి. చికెన్‌కు డిమాండ్ తగ్గింది. ధరలు తగ్గాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– రవికుమార్, కరివేముల, జూపాడుబంగ్లా మండలం

పేరుకుపోతున్న గుడ్ల నిల్వలు



ప్యాలకుర్తిలో పేరుకపోయిన గుడ్ల స్టాకు

బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన తర్వాత గుడ్ల వినియోగం భారీగా పడిపోయింది. జనవరి నెల చివరి వరకు 100 గుడ్ల ధర రూ.500 పైబడి ఉంది. బర్డ్‌ఫ్లూ ప్రచారం మొదలైన తర్వాత గుడ్లకు డిమాండ్ ఒక్కసారిగా పడిపోయింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో గుడ్ల ఫారాలు ఉన్నాయి. ఇక్కడి ఫారంలో రెండు లక్షల కోళ్లు ఉన్నాయి. రోజుకు 40 వేల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. గుడ్లను అడిగే వారు లేరు. బాగా ఉడికించి తినే అవకాశం ఉన్నప్పటికీ వినియోగదారులు భయపడుతుండటంతో డిమాండ్ పడిపోయింది. నేడు 100 గుడ్ల ధర రైతు దగ్గర రూ.370కి పడిపోయింది. జిల్లా నుంచి గుడ్లు బయటికి వెళ్లకుండా చెక్‌పోస్టులు పెట్టడంతో నిల్వలు పేరుకపోతున్నాయి.

రూ.20 లక్షల నష్టం వచ్చింది



బర్డ్‌ఫ్లూ ప్రచారం మొదలైన తర్వాత గుడ్ల వినియోగం భారీగా పడిపోయింది. ఒక్క గుడ్డుపై రూ.1.30 ధర తగ్గింది. వారం రోజుల వ్యవధిలోనే దాదాపు రూ. 20 లక్షల నష్టం మూట కట్టుకున్నాం. నిల్వలు పేరుకుపోతున్నాయి. బయటికి పంపే అవకాశం లేదు. స్థానికంగా డిమాండ్ పడిపోయింది. వంద గుడ్ల ధర రూ.370కి పడిపోయిందంటే రైతుకు ఎంతభారీగా నష్టం వస్తుందో ఊహించవచ్చు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– వెంకటేష్, ప్యాలకుర్తి, కోడుమూరు మండలం

ప్రాణాలతో చెలగాటమాడితే సహించం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి



డీఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్‌కు సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ప్రాణాలతో టీడీపీ నాయకులు చెలగాటమాడితే ఇకపై సహించేది లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి హెచ్చరించారు. నంద్యాల డీఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్‌ను శనివారం ఆమె కార్యాలయంలో కలిసి టీడీపీ నాయకుల ఆరాచకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. బాధితులపైనే తిరిగి తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. బండిఆత్మకూరు మండలం చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త పుల్లయ్యను టీడీపీ నాయకుడు రామలింగారెడ్డి తీవ్రంగా వేధించారని తెలిపారు. ఇది తట్టుకోలేని పుల్లయ్య తన సెల్‌ఫోన్‌తో సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో ప్రాణాపాయస్థితితో ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ నేతల ఒత్తిళ్లతో యూరియా కొరతతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బండిఆత్మకూరు ఎస్ఐ తప్పుడు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ విషయంపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని కోరామన్నారు. మసీదుపురం గ్రామంలో ఉన్న టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి దాడులు చేశారని, తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు నమోదు చేయటం సరైందికాదన్నారు. నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో టీడీపీ నాయకుల దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడితే ఇక సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలపై పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే తాము రహదారులపైకి వచ్చి నిరసనలు తెలపాల్సి వస్తుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలతో పాటు నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, గన్ని కరీమ్, సోమశేఖర్‌రెడ్డి, పార్థుడు, రాయమాల్పురం బాషా, మహబూబ్, న్యాయవాది కృష్ణారెడ్డి ఉన్నారు.

శ్రీశైలంలో పార్కింగ్ ఏర్పాట్లు

- ఏపీ, టీజీ, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు ప్రత్యేకంగా బస్టాండ్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భక్తులు వేలాది వాహనాల్లో బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. వాహనాల పార్కింగ్ కోసం క్షేత్ర పరిధిలో మొత్తం 25 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్, వాసవి విహార్ పక్కన, ఆగమ పాఠశాల ఎదురుగా, ఆర్టీసీ బస్టాండ్ వెనుక, గణేశసదన్ ఎదురుగా, విభూతిమఠం పార్కింగ్ ఏరియా, ఫిల్టర్‌బెడ్, గణేశసదనం పక్కన, మల్లమ్మ కన్నీరు వద్ద, గురుసదన్ ఎదురుగా తదితర ప్రదేశాలలో మొత్తం 25 ఎకరాల్లో 5,050 వాహనాలు పార్కింగ్ చేసుకునే వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు ప్రాంగణాలను తీర్చిదిద్దారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెంట కూడా ప్రైవేట్ ఆర్టీసీ బస్సులు నిలుపుకునే వెసలుబాటు కల్పించారు. మొత్తం 13.80 ఎకరాల్లో 4,640 ఆర్టీసీ బస్సులు నిలుపుకోవచ్చు. కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్‌బస్సులు నిలుపుకునే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే తాత్కాలిక టాయిలెట్స్, తాత్కాలిక వసతి పొందేందుకు షామియానాలు, స్నానమాచరించేందుకు అవసరమైన నీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు పార్కింగ్‌ల వద్ద సమాచార కేంద్రాలను, క్షేత్ర పరిధిలో ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్లాలో భక్తులకు తెలిసే విధంగా సూచికబోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.

అపరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం



గాజులపల్లెలో చెత్త సేకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది: 'పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా? అధికారులు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించడం లేదా?' అంటూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజులపల్లె గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజులపల్లెలోని హోటళ్ల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం చెందారు. వ్యాపారులకు అవగాహన కల్పించి చెత్తబుట్టలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.

➤ గాజులపల్లెలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న పద్మశివ డాబాలో తనిఖీ నిమిత్తం వెళ్లిన జిల్లా కలెక్టర్ పరిసరాలు సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ.లక్ష జరిమానా విధించాలని మండల పరిషత్ కార్యాలయ అధికారులను ఆదేశించారు. డాబా పరిసరాలన్నింటిని శుభ్రంగా ఉండేలా చూడాలని, అపరిశుభ్రంగా ఉన్న వస్తువులన్నింటినీ పడేశారు.

మానవత్వం చాటుకున్న జిల్లా కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి జిల్లా కలెక్టర్ రాజకుమారి మానవత్వం చాటుకున్నారు. బోయిలకుంట్ల గ్రామానికి చెందిన హరి, రాజా నంద్యాలకు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో గాయపడ్డారు. అయ్యలూరు వెళ్తున్న కలెక్టర్ రాజకుమారి వారిని చూసి కారు ఆపి చలించారు. వెంటనే వారిద్దరిని స్థానికంగా ఉన్న ఓ వాహనంలో చికిత్స నిమిత్తం గాజులపల్లెలోని ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మానవత్వాన్ని చూసి స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఈఓఆర్డీ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీ మానవతా విలువలు నేర్పింది

- రిటైర్డ్ డీజీపీ డాక్టర్ డీటీ నాయక్
- అట్టహాసంగా అలుమ్ని మీట్ ప్రారంభం



పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ డీటీ నాయక్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల ఎంతో మందికి మానవతా విలువలు నేర్పిందని రిటైర్డ్ డీజీపీ డాక్టర్ డీటీ నాయక్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(అలుమ్ని) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించే నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు, అలుమ్ని మీట్ శనివారం కళాశాలలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కేఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ డీటీ నాయక్ మాట్లాడుతూ తాను ఈ జిల్లాకు చెందినవాడినేనని, అందుకే ఈ ప్రాంతమంటే తనకు ప్రత్యేక అభిమానముందన్నారు. త్యాగమంటే ఈ ప్రాంతం వారిదేనన్నారు. ఏకంగా రాజధానినే ఈ ప్రాంతం త్యాగం చేసిందని, అందుకే ప్రతిఫలంగా కేఎంసీ దక్కిందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారని, ఎక్కడికి వెళ్లినా కేఎంసీ పేరు వినిపిస్తుందని తెలిపారు. మాజీ ఎంపీ డాక్టర్ ఎంవీ మైసూరా రెడ్డి మాట్లాడుతూ తాను నాలుగు దశాబ్దాల క్రితం 1966 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థిగా ఈ కాలేజీలో చదివానన్నారు. అప్పట్లో వైద్యవిద్యార్థి సంఘం నాయకునిగా తాను ఎన్నికైనట్లు గుర్తు చేసుకున్నారు.

➡ అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి, గైనకాలజిస్టు డాక్టర్ గురురాజ మాట్లాడుతూ ఈ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని, ఒక్కరు ఇవ్వడం మొదలు పెడితే అందరూ ముందుకు వస్తారని సూచించారు. అనంతరం దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులచే నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో నగరాభివృద్ధికి పాటుపడదాం



సమావేశంలో పాల్గొన్న నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు

- 18న మాజీ సీఎం జగన్‌తో పాలక వర్గ సభ్యుల భేటీ
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎస్వీ, కాటసాని



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): 'నగర పాలక సంస్థ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. పాలకవర్గ సభ్యులందరూ ఐకమత్యంతో నగరాభివృద్ధికి పాటుపడదాం' అని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం సాయంత్రం గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, మాజీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ కలిసి కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుదీర్ఘంగా పలు సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, నగర మేయర్, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కార్పొ రేటర్లతో ప్రత్యేక సమావేశం కానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో రాజకీయ అంశాలు, నగరాభివృద్ధి, అధికార పార్టీ కుట్రలు, కుతంత్రాల ను దీటుగా ఎదుర్కోవడంపై చర్చించనున్నట్లు తెలి పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కర్నూ లు నగరంలో నాలుగేళ్లుగా రూ.720 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నగరంలో అభివృద్ధి పనులు అటకెక్కాయన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం కింద ఆయా వార్డుల్లో రూ.34 కోట్లతో చేపట్టాల్సిన 160 పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇంకా ఏడాది పాటు వైఎస్సార్‌సీపీ పాలకవర్గానికి గడువు ఉందని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి ప్రజలకు అండగా నిలుద్దామన్నారు. సమావేశంలో నగరపాలక వర్గ సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోరాహోరీగా పోలీసు క్రీడాపోటీలు



గెలుపొందిన నంద్యాల ఏఆర్‌టీమ్ జట్టు

పాణ్యం: నంద్యాల జిల్లా పోలీసు క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీల్లో శనివారం ఆత్మకూరు డివిజన్‌పై నంద్యాల ఏఆర్ డివిజన్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీఎస్పీ రాజసింహారెడ్డి, సీఐ చాంద్‌బాషా, మంజునాథ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

బాలుడి మృతదేహం లభ్యం



తులసీగౌడ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామ సమీపంలో గల్లంతైన బాలుడు తులసీగౌడు(12) మృతదేహం శనివారం లభ్యమైంది. డోన్‌కు చెందిన దామోదర్‌గౌడు, రాజేశ్వరి దంపతుల కుమారుడైన తులసీగౌడ్ రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు హంద్రీవాగులో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. బాలుడి ఆచూకీ కోసం ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన 15 మంది సిబ్బంది శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో మృతదేహం కొట్టుకుని పోయి శనివారం మద్దికెర మండలం హంప గ్రామ సమీపంలోని వాగులో తేలింది. గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సుంకేసుల డ్యామ్ బ్యాక్ వాటర్‌లో ఇసుకను మోటార్లు పెట్టి తోడుతున్న దృశ్యం



ఇసుకను తోడేస్తున్నారు

తాము అధికారంలోకి వస్తే ఉచితంగా పేదలకు ఇసుక అందజేస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక ఉచితం మాట పక్కన పెట్టి దోపిడీకి తెరతీశారు. తాజాగా కర్నూలు నగర ప్రజలతో పాటు పలు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే సుంకేసుల డ్యాంను సైతం వదలడం లేదు. ఈ డ్యాం ఎగువ భాగంలోని బ్యాక్ వాటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక మిషన్ల ద్వారా ఇసుకను తవ్వి మరబోట్ల ద్వారా ఒడ్డుకు చేర్చుతున్నారు. తర్వాత సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ ఇసుక తవ్వకాలను కట్టడి చేయాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే భూగర్భజలాలు అడుగంటిపోయి రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 30 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



బోట్ల నుంచి తెచ్చిన ఇసుకను జేసీబీతో బయటకు తరలిస్తున్న దృశ్యం



డ్యాం నీటిలో మోటార్లతో తోడిన ఇసుకను బోట్ల ద్వారా ఒడ్డుకు తెస్తున్న దృశం

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు



గాజులదిన్నె ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల: వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) డీఈ విజయ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. శనివారం మండలంలోని జీడీపీని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఎన్ని టీఎంసీల నీరు ఉంది.. ఎన్ని ఎకరాల ఆయకట్టు ఉంది, హెచ్‌ఎన్‌ఎస్ నుంచి ప్రాజెక్టుకు వచ్చే నీరు తదితర వివరాలను డీఈని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఏఈ మహమ్మద్ ఆలీ, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

కోడుమూరు రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 17వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సీ ఆపై విద్యార్హత కలిగిన యువతీయువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరయ్యే వారు వెంట విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలని సూచించారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కర్నూలు (సిటీ): బస్సు డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీటీసీ ఎస్.శాంతకుమారి, ఆర్‌టీఓ ఎల్ భరత్ చౌహాన్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఎంవీఐ కె.రవీంద్ర కుమార్ సూచించారు. కర్నూలు 1,2 డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో శనివారం కర్నూలు–2 డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే రోడ్డుపై ఉన్న సూచనల బోర్డులను గమనించి, ఇతర వాహనదారులకు ఇబ్బంది లేకుండా డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం కర్నూలు రీజియన్‌లో ప్రమాద రహిత డ్రైవర్లను ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు.



డ్రైవర్‌ను సన్మానిస్తున్న డీటీసీ శాంతకుమారి, తదితరులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



తంగరడోణలో మృతి చెందిన ముల్లా నన్నేసాబ్

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో శుక్రవారం రాత్రి ముల్లా నన్నేసాబ్ (39) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో భార్య బానుబీ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు.

కన్నడ సాహిత్య సమ్మేళనంలో ప్రతిభ



శిరుగుప్పలో సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా శిరుగుప్పలో జరుగుతున్న 7వ కన్నడ సాహిత్య సమ్మేళనలో మండల కేంద్రం హొళగుందకు చెందిన భారత్ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శివశంకర్‌గౌడ్, చిన్నహ్యాట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొడ్డబసప్ప, బయలు నాటక కళాకారుడు వందవాగిలి పొంపయ్యస్వామి తదితరులు ప్రతిభ కనబరిచారు. వీరిని శనివారం రాత్రి శిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, కన్నడ సాహిత్య పరిషత్ శిరుగుప్ప అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్, మహాస్వాములు సత్కరించారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

ఆలూరు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి విమర్శించారు. ఆలూరులోని ఓ హోటల్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల ముందు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారన్నారు. ప్రజలు నమ్మి ఓటేసి గెలిపించాక వాటిని అమలు చేయకపోగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని సాకులు చెబుతున్నారన్నారు. తొలి నుంచి ప్రజలను మోసం చేయడం బాబు నైజమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పరని, అందుకు ఆయన ఐదేళ్ల పాలనే నిదర్శనమన్నారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయనదని చెప్పారు. సచివాలయ, ఆర్‌బీకేల ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్ జగన్ తీసుకొచ్చారన్నారు. నేడు వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు.ప్రశ్నించే వారిపై దాడులు, కేసులతో బెదిరిస్తోందని చెప్పారు. అన్యాయంగా వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేస్తుందని..కూటమి అరాచక పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో దేవనకొండ మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరుణకుమార్, అలిగేరు గ్రామ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఎల్లార్తి అశోక్‌రెడ్డి కొత్తకాపు శేషాద్రిరెడ్డి, మోహిద్దీన్, రాఘవేంద్రరెడ్డి, రంగస్వామి, మల్లికార్జునరెడ్డి, తిక్కన్న, ప్రకాష్‌రెడ్డి ,రామాంజనేయులు, ప్రవీణ్, పులి తదితరులు పాల్గొన్నారు.

లెనోవా ల్యాప్‌ట్యాప్స్ షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో లెనోవా షోరూంను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో శుక్రవారం సాయంత్రం లెనోవా అథరైజ్డ్ కంపెనీ ల్యాప్‌ట్యాప్స్ షోరూం ప్రారంభమైంది. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అతిథిగా హాజరై ఈ షోరూంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ రంగం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్స్, డెస్క్‌టాప్స్, ట్యాబ్స్ ప్రాధాన్యత ఎంతో పెరిగిందన్నారు. జీఎం కంప్యూటర్స్ సంస్థ అధినేత షేక్ అబ్దుల్ నబీ, షేక్ షాకీర్ బాషా మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో 23 సంవత్సరాల అనుభవం ఉందని, తమ లెనోవా షోరూంలో లాప్‌ట్యాప్స్‌తో పాటు గేమింగ్ లాప్‌ట్యాప్స్, మానిటర్స్, ట్యాబ్స్ అన్ని రకాల నాణ్యమైన ఉత్పత్తులు ఆన్‌లైన్ ధరల కన్నా 5 శాతం తక్కువకు అందిస్తున్నట్లు చెప్పారు. షోరూంలో సర్వీస్ సెంటర్ ఉందని, మూడేళ్ల వారంటీ ఫ్రీ సర్వీసు ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులు పరదేశ్, కార్తీక్, జస్‌ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు వీఆర్‌ఓ మృతి



అనంత సేనారెడ్డి (ఫైల్)

బండ ఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణాపురం గ్రామానికి చెందిన వెలుగోడు వీఆర్వో ఎండూరి.అనంతసేనారెడ్డి (60) శనివారం సాయంత్రం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య సత్యాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న శ్రీ శైలం మాజీ శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను ఫోనులో పరామర్శించారు.


గూడ్స్ రైలు కింద పడి..



మృతి చెందిన వృద్ధుడు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ వద్ద గూడ్స్ రైలు కింద పడి కోట్లవారిపల్లెకి చెందిన చిన్నన్న(85) అనే వృద్ధుడు మరణించాడు. గూడ్స్ రైలు గార్డు సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు కోట్లవారి పల్లెకి చెందిన చిన్నన్నగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్యనా అనే కోణంలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం



మృతిచెందిన శివమ్మ

బనగానపల్లె రూరల్: మండలం పరిధిలోని యనకండ్ల గ్రామానికి చెందిన టి. శివమ్మ(35)అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు స్థానికులు తెలిపిన మేరకు.. యనకండ్ల గ్రామానికి చెందిన బాలుడు,శివమ్మ దంపతులు కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. అయితే, కుటుంబంలో నెలకొన్న సమస్యల కారణంగా ఇంట్లో ఎవరులేని సమయంలో ఆమె సిలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

వెల్దుర్తి: సూక్ష్మ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ నోడల్ ఏజెన్సీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలో పీఎమ్‌ఎఫ్‌ఎమ్‌ఈ స్కీం కింద ఏర్పాటు చేసుకున్న దాల్ మిల్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మార్కెటింగ్ అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, పాడి, మత్స్య సంపదలకు అనుబంధంగా ఆహార ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటుతో అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. 18 నుంచి 55 ఏళ్లలోపు వారికి సబ్సిడీతో పాటు యూనిట్ కాస్ట్‌లో కేవలం 10 శాతం పెట్టుబడితో బ్యాంకుల ద్వారా 90 శాతం రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

ఇంటింటి ఫీవర్ సర్వే

కర్నూలు(హాస్పిటల్): బాతులకు బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో కర్నూలు నగరంలోని ఎన్ఆర్ పేటలోని ఒక కిలోమీటర్ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది శనివారం ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టింది. ఎన్ఆర్ పేటలోని 47, 47ఏ, 48 వార్డుల్లోని 89 గృహాల్లో 320 మందికి ఎనిమిది బృందాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో జ్వర లక్షణాలు కలిగిన వారు లేరన్నారు.

ఆత్మకూరులో 18న జాబ్‌మేళా



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 18వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక కళాశాలలో వారు శనివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాకు ఐదు ప్రయివేట్ కంపెనీలు (అరబిందో ఫార్మసీ, గ్రీటెక్ ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్, రాయ్స్ డైరెక్ట్ సర్వీసెస్, టాటా కాపిటల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్) పాల్గొంటాయన్నారు. ఈ జాబ్‌మేళాలలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 6303244165, 7673902328 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.